VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ అక్టోబర్ 20 ఆదివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 94

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



2లో

## గ్రూప్-1పై ప్రభుత్వం

# అప్రమత్తం

- పొన్నం ఇంట్లో పలువురు మంత్రుల భేటీ
- హాజరైన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- ఉన్నతాధికారులు, న్యాయ నిపుణులతో అర్ధరాత్రి దాకా చర్చలు
- నేడు కీలక ప్రకటన చేసే అవకాశం

**గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలని అభ్యర్థులు ఆందోళనకు దిగడం.. వారికి ప్రతిపక్షాలు సైతం మద్దతు పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది.**

---

**గ్రూప్-1 మెయిన్స్ విషయంలో అభ్యర్థులు ఆందోళన విరమించాలని.. అనుమానాలు వీడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అపోహల సంఘం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడి తమ రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలనుకుంటోందని విమర్శించారు.**

- అపోహల సంఘం మీ జీవితాలతో చెలగాటమాడుతోంది
- ప్రిలిమ్స్ పూర్తయిన ఇన్నాళ్లకు వితండవాదం సరికాదు
- గ్రూప్-1 అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- వారిపై లాఠీఛార్జి, కేసులు వద్దని పోలీసులకు ఆదేశం



# అనుమానాలు వీడండి.. పరీక్షలు రాయండి..

హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ విషయంలో అభ్యర్థులు ఆందోళన విరమించాలని.. అనుమానాలు వీడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అపోహల సంఘం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడి తమ రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలనుకుంటోందని విమర్శించారు. నిరుద్యోగుల ఆందోళన విషయంలో పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని.. వారిపై లాఠీఛార్జ్, కేసులు వద్దని ఆదేశించారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శుక్రవారం జరిగిన పోలీసు డ్యూటీమీట్ ముగింపు సభలో సీఎం పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. 'భారాస పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు మీరు వాళ్ల గేట్ల దగ్గర నిలుచుంటే కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వనివారు ఇప్పుడు అశోక్‌నగర్‌కు వచ్చారంటే అది కొంగజపం కాదా? ఇప్పటికే 95 శాతం మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు తీసుకున్నారు. మిగిలినవారూ తీసుకొని పరీక్షలకు హాజరుకండి. లేదంటే బంగారు అవకాశాన్ని కోల్పోతారు. జీవో 29పై కోర్టులో ఉపశమనం రాలేదంటే.. మీ వాదనలో బలం లేదని తెలిపోయింది. కృశ్చన్‌బ్యాంకు విషయంలో నిపుణుల కమిటీపై వేసిన పిటిషన్లను కొట్టేసిన న్యాయస్థానం కూడా ప్రభుత్వ పరీక్ష విధానాన్ని సమర్థించింది.

ప్రిలిమ్స్ అయిపోయిన ఇన్నాళ్లకు వితండవాదం

గత పదేళ్లుగా వాయిదాలు పడుతున్న ఉద్యోగాలను భర్తీ చేస్తున్నాం. 563 గ్రూప్-1 పోస్టులకు ఈ నెల 21 నుంచి మెయిన్స్ నిర్వహించబోతున్నాం. ఫిబ్రవరిలోనే జీవో 29 ద్వారా నోటిఫికేషన్ ఇచ్చాం. 1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు పిలవాలని ఆనాడే నిర్ణయించాం. దాదాపు 31 వేల మందిని మెయిన్స్‌కు ఎంపిక చేశాం. ప్రిలిమ్స్ అయిపోయిన ఇన్నాళ్లకు 1:100 లెక్కన పిలవాలని కొందరు వితండవాదం చేస్తున్నారు. ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత మార్పులు చేస్తే కోర్టులు ఊరుకుంటాయా? గత ప్రభుత్వం నాటి జీవో 55 ప్రకారం భర్తీ చేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు నష్టపోయేవారు. ఇప్పుడు జీవో 29తో జనరల్‌కోటాలోనూ పోటీ పడేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశం దక్కింది.

వచ్చే విద్యాసంవత్సరంలోనే యంగ్ ఇండియా పోలీసు స్కూల్

'దాదాపు 11 ఏళ్లుగా డ్యూటీమీట్ నిర్వహించకపోవడంతో పోలీసుల నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం లేకుండా పోయింది. అందుకే ఉన్నతాధికారులు చెప్పిన వెంటనే నిర్వహించమన్నాను.విధినిర్వహణ కారణంగా మీ పిల్లలతో మీరు పూర్తి సమయం గడపలేకపోతున్నారు. వారు గొప్ప పౌరులుగా రాణించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రేహౌండ్స్‌కు చెందిన 50 ఎకరాల్లో అంతర్జాతీయస్థాయి విద్యాప్రమాణాలతో యంగ్‌ఇండియా పోలీసు స్కూల్‌కు ఈ నెల 21న శ్రీకారం చుడుతున్నాం. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, సైనిక్ స్కూల్, కార్పొరేట్ పాఠశాలల వంటి వాటితో పోటీపడేలా దాన్ని తీర్చిదిద్దుతాం.

హెచ్‌పీఎస్, డీపీఎస్‌ల నుంచి వచ్చామని గొప్పగా చెప్పుకొన్నట్లే పోలీసుస్కూల్ నుంచి వచ్చిన విద్యార్థులమని గర్వపడేలా విద్యాసంస్థను

తీర్చిదిద్దుతాం. వచ్చే విద్యాసంసవత్సరంలోనే తొలివిడతగా 5 నుంచి 8 తరగతులను ప్రారంభిస్తాం. తర్వాత తరగతులను పెంచుకుంటూ ఇంజినీరింగ్, మెడిసిన్ వరకు చదివేలా తీర్చిదిద్దుతాం.

డ్రగ్స్, సైబర్‌నేరాల నియంత్రణలో పోలీసుశాఖకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ఎంతటివారున్నా కఠినంగా వ్యవహరించండి' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

---

మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా

# రైతుభరోసా

- వచ్చే సీజన్ నుంచి పంటబీమా పథకలం అమలు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

2లో



---



2లో..

పివి సింధుకు మరో ఏడాది పాటు

# వెసలుబాటు

ఆన్‌డ్యూటీ కాలాన్ని పొడిగించిన ప్రభుత్వం

---



2లో..

# జీవో 29 వెనక రిజర్వేషన్ల రద్దు కుట్ర

- బిఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు

---



2లో..

# పథకాల పేరుతో దోచుకుని నీతులు చెబుతారా

- కెటిఆర్, హరీష్‌లు బుద్ది వుంటే మాట్లాడుతున్నారా?
- లక్షల కోట్లు దోపిడీ చేసి రోడ్ల మీద పడుతారా
- మండిపడ్డ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

---

వైద్యులారా ఆందోళన

# విడనాడండి

ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రండి

మరోమారు చర్చలకు ఆహ్వానించిన సిఎం మమత



2లో..

---

# దేవుళ్ల మీద ఒట్లేసి "హామీలు" గట్టుమీద పెట్టారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ఈటెల రాజేందర్ ధ్వజం. మూసి, రైతాంగ సమస్యలపై ఉద్యమిస్తామని వెల్లడి.

2లో..



## పివి సింధుకు మరో ఏడాది పాటు వెసలుబాటు



**అమరావతి:** ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని మరో ఏడాది పొడిగించింది. ఆసియా, కామన్‌వెల్త్ క్రీడలతో పాటు 2025-26లో వివిధ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ నిమిత్తం పీవీ సింధుకు ఆన్ డ్యూటీ సదుపాయాన్ని పొడిగించింది. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓడీని పొడిగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు 2016 ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. దీంతో అప్పటి తెలుగు ప్రభుత్వాలు పీవీ సింధును ఘనంగా సన్మానించడంతో పాటు నజరానా ప్రకటించాయి. గ్రూప్-1 హోదాతో ప్రభుత్వ ఉద్యోగం కూడా ఆఫర్ చేశాయి.
అయితే ఏపీలో ప్రభుత్వ ఉద్యోగం చేసేందుకు పీవీ సింధు సుముఖత వ్యక్తం చేశారు. తొలుత విజయవాడ గొల్లపూడిలోని ఏపీ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) కార్యాలయంలో పీవీ సింధు విధుల్లో చేరారు. డిప్యూటీ కలెక్టర్ విధులు, బాధ్యతలపై శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వం ఆధీనంలో ఉన్న లేక్‌వ్యూ అతిథిగృహంలో ఓఎస్డీగా విధులు నిర్వహిస్తున్నారు.

## జీవో 29 వెనక రిజర్వేషన్ల రద్దు కుట్ర



**హైదరాబాద్:** జీవో 29 వెనుక రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర దాగి ఉందని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో శనివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'అన్ని వర్గాలకు
న్యాయం చేసేందుకే మోదీ ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చింది. జీవో 29 వల్ల అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందనేది వాస్తవం. గ్రూప్-1 రద్దు చేయాలని ఎవరూ అడగట్లేదు, వాయిదా వేయాలని మాత్రమే కోరుతున్నారు. భారాస ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోంది. పరీక్ష పూర్తయిన తర్వాత కోర్టు రద్దు చేస్తుందనే భయం అభ్యర్థుల్లో ఉంది. సోనియాగాంధీ జన్మదినం రోజున ఇంకా ఎంతమందిని బలి తీసుకుంటారో తెలియదు. గ్రూప్-1 అభ్యర్థులపై రోజూ లాఠీఛార్జి జరుగుతోంది. వారిది న్యాయమైన డిమాండ్. రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే స్పందించాలి. సమస్యను పరిష్కరించేందుకు ఆలోచించాలి కానీ, ప్రభుత్వం మొండిపట్టుతో వ్యవహరించడం మంచికాదు. నిరుద్యోగుల ఆందోళనపై భారాస పెద్ద కుట్ర చేసింది. మా ర్యాలీలో చొరబడి విధ్వంసాలకు పాల్పడాలని చూస్తే నిరుద్యోగ యువత అడ్డుకున్నారు. మా పార్టీ కార్యకర్తలతో గొడవకు దిగారు' అని బండి సంజయ్ వివరించారు.

## కెటిఆర్, హరీష్‌లు బుద్ధి వుంటే మాట్లాడుతున్నారా?



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథ ఇంకా ఏవో పేర్లు చెప్పి 7 లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. 'మాకు పదేళ్ల కింద 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే సమస్య పరిష్కారం అయ్యేది? వాడు తలకాయ ఉండి మాట్లాడుతున్నారా. వంద అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారు. అరె పిచ్చి కేటీఆర్.. చేసేదే చెప్పాము. మీలాగా అమలు కానీ హామీలు ఇవ్వలేదు. ఎంత కష్టం అయినా నెల మొదటి రోజే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం. కేటీఆర్, హరీష్‌కు ఏం పుట్టింది మీకు రాజకీయాలు వస్తాయా.. అసెంబ్లీ, పార్లమెంట్ లో ఓడిపోయిన బీఆర్ఎస్ వాళ్ళు వేరే దేశానికి వెళ్లి బ్రతుకుతారు అనుకున్నా.. కానీ సిగ్గు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్నారు' అంటూ ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. నల్గొండలో అనారోగ్యం బారిన పడిన వారు చాలా మంది ఉన్నారని.. ఎన్నో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్‌టీపీలతో సమస్య
పరిష్కారం కాదని.. స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని మంత్రి తెలిపారు. ఫ్లోరైడ్ కు శాశ్వత పరిష్కారం ఎస్ఎల్‌బీసీ అని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, మూసీ శుద్ధీకరణ విషయంలో ముఖ్యమంత్రిని అభినందుస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు ఎ÷-లోరైడ్, మరోవైపు కోటిన్నర మంది వాడిన నీరు నల్గొండలో పారుతోందన్నారు. గత ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీలో 5 వేల కోట్లు దోచుకుతిన్నారని మండిపడ్డారు. కేసీఆర్ కొడుకు అంటే గుర్తు పడతారు కానీ.. కేటీఆర్ అంటే ఎవరూ గుర్తు పట్టరంటూ వ్యాఖ్యలు చేశారు. అధికారం కోల్పోయినా అహం తగ్గలేదన్నారు. ప్రపంచంలో అన్ని దేశాలు తిరిగి వేల కోట్లు సంపాదించి ఎక్కడ పెట్టుకోవాలో తెలియని డబ్బులు సంపాదించారంటూ మండిపడ్డారు. కేటీఆర్.. నల్గొండ మంత్రులు రెచ్చగొడితే రెచ్చి పోరని, స్వతహాగా పౌరుషం ఉన్న వ్యక్తులమని స్పష్టం చేశారు. అసలు కేటీఆర్, హరీష్ రావులు నాయకులే కాదని అన్నారు. అన్నింటిలో భాగస్వామ్యాలు ఉన్నాయని.. నారాయణ సంస్థల్లో హరీష్‌కు వాటా ఉందని తెలిపారు. కిషన్ రెడ్డికి ఏమీ తెలియదని.. ఆయన గురించి మాట్లాడం వేస్ట్ అంటూ కామెంట్స్ చేశారు. ఆయన రాజకీయ నాయకుడు కాదన్నారు. కేటీఆర్, హరీష్ దొంగలని... అందుకే వాళ్ళ విషయాలు అందరికీ తెలియాలని మాట్లాడుతున్నానన్నారు. అమెరికా వెళ్లి ప్రభాకర్ రావును కలిసి కాళ్ళు పట్టుకుని మరీ ఇండియాకు రావొద్దని బ్రతిమిలాడినట్లు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావులకు నల్గొండ వాళ్లంటే ఎందుకు అంత కోపమని ప్రశ్నించారు. 'విషం పెట్టి చంపండి, లేదంటే మేమే చచ్చి పోతాం' అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీష్ మూసీ ప్రజలను రెచ్చ గొడుతున్నారుని.. వాళ్ళ ఇంటి వద్ద ఎక్కడపడితే అక్కడ శాంతియుత పద్ధతిలో నిరసన చెబుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

## వైద్యులారా ఆందోళన విడనాడండి




**కోల్‌కతా:** కోల్‌కతాలో ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే.. వైద్యారోగ్య సేవలపై దాని ప్రభావం పడకూడదని ఆమె వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ముందుకు తెచ్చిన డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చామని, మిగతా వాటి కోసం 3-4 నెలల సమయం ఇవ్వాలని మమత వైద్యులను కోరారు. ఈ విషయంపై చర్చలకు రావాలని మరోసారి జూనియర్ వైద్యులకు పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్ లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా ఈ విషయంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని విజ్ఞప్తి చేశారు. జూనియర్ డాక్టర్లు సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రావాలని మమత మరోసారి ఆహ్వానించారు. ఆర్జీకర్ ఆసుపత్రి వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల వేదిక వద్దకు శనివారం చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ వెళ్లారు. ఈ సమయంలో సీఎం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు చేసిన పలు డిమాండ్లను నెరవేర్చడానికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయాలను ప్రభుత్వానికి వైద్యులు నిర్దేశిరచడం సరికాదని వ్యాఖ్యానించారు. వైద్యుల డిమాండ్లపై చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగించారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమించి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభుత్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. దీక్షలో పాల్గొన్న పలువురు అనారోగ్యానికి గురవుతుండటంతో సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# దేశ భవిష్యత్‌ను నిర్ణయించే మహా ఎన్నికలు



ముంబయి:: మహారాష్ట్రలో నవంబర్ 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ' సీట్ల పంపకంలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీకి 12 స్థానాలు ఇవ్వాలని కోరినట్లుగా సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. తమ పార్టీకి బలమున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. మహారాష్ట్రలోని ధూలే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఇర్షాద్ జహాగీర్దార్‌ను ప్రకటిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. ధూలే నగరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ భాజపాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో పార్టీలను విభజించి.. అధికారాన్ని దొంగిలించిందని అఖిలేష్ దుయ్యబట్టారు. అసెంబ్లీకి విద్యావంతులైన ఎమ్మెల్యేలను పంపడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. 'మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు. ఇవి చారిత్రకమైనవి. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఉండదు. దీంతో దిల్లీలోని కేంద్ర ప్రభుత్వం కూడా కూలిపోతుంది. అన్ని విషయాలకు బుల్డోజర్‌లను పంపే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు' అని అఖిలేష్ జోస్యం చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను, దాని మిత్రపక్షాలను ఓడించి.. తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు
తరలిస్తోందని ఆయన ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. రాష్ట్రంలో ఒకే దశలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# దేవుళ్ల మీద ఒట్లేసి "హామీలు" గట్టుమీద పెట్టారు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 19:**

ఎన్నికల సమయంలో దేవుళ్ల మీద ఒట్లేసి హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించిన కాంగ్రెస్, అధికారంలోకి రాగానే వాటిని గట్టుమీద పెట్టేశారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. నగరంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈటెల రాజేందర్ మాట్లాడారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. తమ పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లైందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు.



పింఛన్లు పెంచడం దేవుడెరుగు ఉన్న పింఛన్లను ఎత్తేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు పండించిన పంటకు కనీస మద్దతు ధర కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించడంలో విఫలం అయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29న సడలించాలని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనకు బీజేపీ మద్దతు ఇస్తుందని అన్నారు. మూసీ బాధితుల పక్షాన, రైతాంగ సమస్యలపై ఉద్యమిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వ స్పందన అభిస్తుందని అన్నారు. సభ్యత్వం కోసం వెళితే ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పై వినతి పత్రాలు ఇస్తున్నారని అన్నారు. భవిష్యత్ లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్, అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ గుప్త, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మోడీ విధానాలే కాంగ్రెస్‌కు రక్ష

**న్యూఢిల్లీ:** మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. అందుకే మొన్నటి పార్టమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. కేవలం మోడీ హామీలు నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం అవుతోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా బిజెపి గెలిచింది. దీంతో ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. ఇప్పటికీ మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరు. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్
ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు. తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలె కాంగ్రెస్ గొడుగు కింద బలంగా మారుతాయి. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలకోసం మోదీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోక్‌సభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు ఇచ్చారు.

## గ్రూప్-1పై ప్రభుత్వం అప్రమత్తం

హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని, జీవో 29ని రద్దు చేయాలని అభ్యర్థులు ఆందోళనకు దిగడం.. వారికి ప్రతిపక్షాలు సైతం మద్దతు పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. దీనిపై ఆదివారం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. ఈ నెల 21వ తేదీ నుంచి మెయిన్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలను కొద్దిరోజులు వాయిదా వేయాలని, జీవో 29ను రద్దు చేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి మద్దతుగా నిరుద్యోగులు హైదరాబాద్‌లో గత కొన్ని రోజులుగా రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో మంత్రుల నివాస ప్రాంగణంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, కొండా సురేఖ శనివారం రాత్రి ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు. అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న ప్రతి అభ్యంతరంపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం సేకరించారు. గ్రూప్-1 పరీక్షను అసలు వాయిదా వేయడం సాధ్యమా అనే కోణంలో అర్ధరాత్రి వరకు సుదీర్ఘంగా మూడు గంటలపాటు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు ఉన్నతాధికారులతో చర్చించారు. జీవో 29పై వస్తున్న విమర్శలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారమే పరీక్షలు ఉన్నందువల్ల ఆదివారం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తే కష్టపడి చదువుకున్న అభ్యర్థుల నుంచి ప్రతికూలత వస్తుందని కూడా చర్చించినట్లు తెలుస్తోంది. పరీక్షను వాయిదా వేయకుండా, ఏ ఒక్క అభ్యర్థీ నష్టపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు చర్చించారు. ఆదివారం మరోమారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి ప్రభుత్వం తుది నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తోంది.

### చేరికలతో జనసేనపై విశ్వాసం పెంచింది

**అమరావతి:** జనసేనలో చేరికలు తమపై విశ్వాసాన్ని మరింత పెంచాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముద్రగడ క్రాంతి, గుంటూరుకు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, నలుగురు జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్లు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సామినేని ఉదయభానుపై నమ్మకం ఉంచి ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలు అప్పగించినట్టు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి బాటలు పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్‌శాఖ పనిచేస్తోంది. అవినీతికి ఆస్కారంలేకుండా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూపాయి లంచం లేకుండా, ఎవరి సిఫారసులు లేకుండా బదిలీలు జరిగాయి. కూటమి ఎమ్మెల్యేలు సిఫారసు చేసినా క్షుణ్ణంగా పరిశీలించి బదిలీలు చేశాం. లంచం అనే పదం వినిపిస్తే కార్యాలయం నుంచి వెళ్లిపోవాల్సిందే. గుడివాడ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని మా దృష్టికి రాగానే చర్యలు చేపట్టాం. ఫిల్టర్ బెడ్లు శుభ్రం చేసి.. నీటి పరీక్షలు నిర్వహించాం. నిధులు మంజూరు చేశాం. ప్రజలకు కావాల్సిన కనీస అవసరాలు తీర్చటం కోసం సిద్ధంగా ఉన్నాం' అని పవన్ కల్యాణ్ తెలిపారు.

## మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఆధారంగా రైతుభరోసా

**హైదరాబాద్:** తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం నివేదిక వచ్చిన తర్వాత రాబోయే సీజన్ నుంచి రైతుభరోసా పథకం అమలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట బీమా పథకం వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతు బీమా, రుణ మాఫీ, రైతు భరోసా, ధాన్యం, పత్తి, ఇతర పంటల కొనుగోళ్ల కనీస మద్దతు ధర, ఇతర వ్యవసాయ అంశాల గురించి మంత్రి మాట్లాడారు. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక రాగానే రాబోయే పంట కాలం నుంచి రైతులకు ఎకరాకు రూ.7500 సాయం అందిస్తామని తెలిపారు. హైదరాబాద్ బీఆర్కేఆర్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణాలు ఉన్న రైతు కుటుంబాలను గుర్తించి డిసెంబరులోగా వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తామన్నారు. అదేవిధంగా రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న, నిర్ధరణ కాని రైతు కుటుంబాల కోసం త్వరలో షెడ్యూల్ ప్రకటించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల కారణంగా దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇస్తున్నామన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కే అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నప్పటికీ... ప్రస్తుతం 25 శాతం మాత్రమే తీసుకుంటుందని కేంద్రం చెప్పారు. పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, టీజీ సీడ్స్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, రైతు సంఘాల నేతలు సారంపల్లి మల్లారెడ్డి, పశ్య పద్మ, నల్లమల వెంకటేశ్వరరావు, లోకసాని పద్మారెడ్డి పాల్గొన్నారు.

# " భవిష్యజ్యోతి" ట్రస్ట్ ఏర్పాటు అభినందనీయం.

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**అనాధ బాలల కోసం దాతలు తోడ్పాటును అందించాలని పిలుపు.**

**పాల్గొన్న జిల్లా జడ్జి, సీ.పీ, బెటాలియన్ కమాండెంట్.**












**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 19**

అనాధ బాలలకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవితకు బాటలు వేయాలనే మహోన్నత సంకల్పంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్యజ్యోతి ట్రస్ట్ ను నెలకొల్పడం ఎంతో అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. తల్లిదండ్రులు లేని చిన్నారుల అభ్యున్నతి కోసం ఏర్పాటైన ఈ ట్రస్ట్ కు అన్ని వర్గాలకు చెందిన దాతలు విరివిగా విరాళాలు సమకూర్చి తమవంతు తోడ్పాటును అందించాలని పిలుపునిచ్చారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో అనాధ పిల్లల కోసం ఏర్పాటైన ట్రస్ట్ ను కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. శనివారం కోర్టు భవన సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల అధ్యక్షత వహించగా, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, డిచ్పల్లి పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రోహిణి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నా అనేవారెవరు లేని అనాధ బాలికలకు ప్రాధమిక దశ నుండే నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలనే దృక్పధంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నెలకొల్పిన ట్రస్ట్ కు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. సాధారణంగా న్యాయ సేవాధికార సంస్థలు లోక్ అదాలత్ ల నిర్వహణ, న్యాయ పరమైన అంశాలపై అవగాహన సదస్సులు వంటి వాటికే పరిమితమవుతాయని, అందుకు భిన్నంగా నిజామాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అన్ని శాఖలను సమన్వయము చేసుకుంటూ విస్తృత స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుండడం ముదావహం అని ప్రశంసించారు. స్వీయ రక్షణ కోసం రికార్డు స్థాయిలో 11 వేల మంది బాలికలకు కరాటేలో శిక్షణ ఇప్పించడం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం వంటి అనేకానేక కార్యక్రమాలను డీఎల్ఎస్ఏ చేపట్టిందని గుర్తు చేశారు. ఇదే కోవలో అనాధ బాలలకు మెరుగైన విద్యను అందించాలనే సదాశయంతో ట్రస్ట్ ను నెలకొల్పడం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అనాథలం అనే భావనను విడనాడి, చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. అనాధ బాలలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించిన కాకతీయ స్కూల్, రవి పబ్లిక్ స్కూల్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ, నిజామాబాద్ లోని బాలసదన్ లో ఆశ్రయం పొందుతున్న అనాధ బాలలకు నాణ్యమైన విద్యను ఇప్పిస్తూ, వారికి అన్ని విధాలుగా తోడ్పాటుగా నిలవాలనే ఆశయంతో భవిష్య జ్యోతి ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల చదువుతో పాటు వారికి అవసరమైన ఇతర సదుపాయాలన్ని ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని తెలిపారు. కోరిన వెంటనే 30 మంది అనాధ బాలికలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన కాకతీయ, రవి పబ్లిక్, నిర్మల హృదయ్ పాఠశాలల యాజమాన్యాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున జిల్లా జడ్జి కృతజ్ఞతలు ప్రకటించారు. అదేవిధంగా నలుగురు అనాధ బాలలను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ దత్తత తీసుకున్నారని తెలుపుతూ, సీ.పీ కనబర్చిన సేవా దృక్పథాన్ని అభినందించారు. అనాధ బాలలకు చక్కటి భవిష్యత్తును అందించేందుకు వీలుగా దాతలు భవిష్య జ్యోతి ట్రస్ట్ కు విరాళాలు అందించి తమ ఉదారత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ట్రస్ట్ పేరిట ప్రత్యేకంగా నిజామాబాద్ నగరంలోని ఐ.సీ.ఐ.సీ.ఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో అకౌంట్ ను తెరవడం జరిగిందని తెలిపారు. దాతలు తమ విరాళాలను భవిష్య జ్యోతి, అకౌంట్ నెంబర్: 354705001646, ఐ.ఎఫ్.ఎస్.సీ కోడ్: ఐసీఐసీ003547, ఐసీఐసీఐ బ్యాంకు, నాందేవ్ వాడ బ్రాంచ్ లో జమ చేయవచ్చని సూచించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మాట్లాడుతూ, అనాధ బాలలను దత్తత తీసుకునే అవకాశం కలగడాన్ని తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తాను బదిలీపై వెళ్తున్నప్పటికీ దత్తత తీసుకున్న బాలలకు తనవంతు తోడ్పాటును అందిస్తుంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి టీ.శ్రీనివాస్, ప్రైవేట్ విద్య సంస్థల నిర్వాహకులు రజనీకాంత్, సరళా మహేందర్, న్యాయాధికారులు, బాలసదన్ చిన్నారులు పాల్గొన్నారు.

**కాకతీయ రజనీకాంత్ ను సన్మానించిన జిల్లా జడ్జి.**

జిల్లా కేంద్రంలోని ప్రముఖ కాకతీయ విద్యాసంస్థ ల అధినేత సిహెచ్ రజనీకాంత్ ను జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం సన్మానించారు. నిజామాబాద్ జిల్లాలో అనాధ(మానవత సదన్) పిల్లలను ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన కాకతీయలో ఉచితంగా విద్య బోధన చేస్తున్నందుకు గాను సన్మానించారు. కాకతీయ విద్యాసంస్థల అధినేత రజినీకాంత్ తో పాటు ప్రిన్సిపాల్ రణదీశ్ ను సన్మానించారు. సన్మానించిన వారిలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు ఉన్నారు.

# ఏటీసీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన.**



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 19**

: జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్ లో గల ప్రభుత్వ బాలుర, బాలికల ఐ.టీ.ఐ ప్రాంగణాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయాల నిర్మాణ పనులను కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులను ప్రశ్నించారు. మరో మూడు మాసాలలో ఏ.టీ.సీ కేంద్రాల భవన సముదాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే తొలివిడతగా మంజూరీ లభించిన నిజామాబాద్, బోధన్, కమ్మర్పల్లి ఐ.టీ.సీలలో ప్రవేశాలు చేపట్టినందున వీటి భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వారం సంబంధిత శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సైతం నిర్మాణ పనుల పరిశీలనకు విచ్చేసే అవకాశాలు ఉన్నందున నాణ్యతతో యుద్ధప్రాతిపదికన పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. వీటి నిర్మాణాల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తేవాలని అన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# జీవనభృతి" కోసం బీడి కార్మికుల ఆందోళన.

**- బిఎల్ టియు, ఏఐఎఫ్ టియు ఆధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయం ముట్టడి.**





**వేగుచుక్క న్యూస్. మాచారెడ్డి, అక్టోబర్ 19**

: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు జీవన భృతి 4016 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, కార్యదర్శి ఆంజనేయులు, తెలంగాణ శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ (ఎఐఎఫ్ టీయూ) అధ్యక్షురాలు అనసూయ, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మాచరెడ్డి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఎంపిడిఓ కార్యాలయంను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2014 సంవత్సరం కటాఫ్ ను ఎత్తివేసి, ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి పెంచి అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికలలో బీడీ కార్మికులకు జీవన భృతి పెంచి ఇస్తామన్న హామీ బుట్ట దాఖలు అయిందనీ అన్నారు. లక్షలాది మంది బీడీ కార్మికుల ఓట్లతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా 4016 రూపాయల జీవన భృతి బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులు, ప్యాకర్లకు, బట్టి, చటన్ తదితరులకు అమలు చేయాలని అన్నారు. లేదంటే రానున్న స్థానిక ఎన్నికలలో బీడీ కార్మికులు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పుతారని పేర్కొన్నారు. కేంద్రం ప్రభుత్వం బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు, కోస్టా చట్టం, జిఎస్టి పెట్టడం వల్ల యాజమాన్యాలు ఉత్పత్తి తగ్గిస్తున్నారని అన్నారు. దీని వల్ల బీడీ కార్మికులకు చేతినిండా పనిలేకుండా పోతుందని, నెలలో 10 రోజులు కూడా కంపనీ నడవడం లేదన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి పెంచి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం నాయకులు నాగరపు ఎల్లయ్య, శ్రామిక శక్తి బీడి వర్కర్స్ యూనియన్ నాయకులు కుర్తి లింగం తో పాటు సయ్యద్, కుమ్మరి రవి, నాంపల్లి, గంగాదర్, శ్రీనివాస్, లక్ష్మి, రాజక్క తదితరులు పాల్గొన్నారు.

# లా అండ్ఆర్డర్ కాపాడలేని సిఎం రాజీనామా చేయాలి.

**- బీజేపీ ఎమ్మెల్యే ధన్ పాల్ డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 19:**

రాష్ట్రంలో లా అండ్ఆర్డర్ కాపాడలేని సిఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలనీ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంఘటన పై అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం ఘాటుగా స్పందించారు. హిందువులు భక్తి శ్రద్దలతో కోలుచుకునే ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన సలీమ్ సల్మాన్, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన జాకిర్ నాయక్ లను శిక్షించకుండా, శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న హిందువులపై అమానుషంగా పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సిఎం రేవంత్ రెడ్డి ఎంఐఎం నాయకుల చేతిలో కీలుబొమ్మగా మారారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపుతప్పిందని, ఇందిరమ్మ ఎమర్జెన్సీ



పాలనను గుర్తు తెచ్చే విదంగా రేవంత్ పాలన కొనసాగుతుందని మండిపడ్డారు. హిందూ ఆడబిడ్డల పైన, హిందూ దేవి, దేవతలపైన, దేవాలయాలపైన దాడులు జరుగున్న ముఖ్యమంత్రి రేవంత్ ముస్లిం వర్గానికి కొమ్ముకాయడం అనేది దుర్మార్గం అన్నారు. హిందూ దేవి, దేవతల పైన దాడులు చేస్తున్న దోషులు ఎంతటివారినైనా కఠినంగా శిక్షించాలని, మరల ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హెూటల్ లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 19:**

నగరంలో పలు హెూటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు శనివారం తనీఖీలు నిర్వహించారు. ఫుడ్ సెప్టి కమీషనర్ అదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ అధికారి జోతిర్మయి అధ్వర్యంలో సోదాలను చేపట్టారు. ఐదు టీంల అధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిఖిల్ సాయి హెూటల్, శాతవాహన, లహరీ ఇంటర్ నేషనల్ హెూటల్స తో పాటు డిల్లివాల స్వీట్ హెూమ్ లలో తనిఖీలను నిర్వహించారు. పరిశుభ్రత పాటించని పలు హెూటళ్లకు నోటీసులు జారీ చేయగా, మరికొన్ని హెూటల్స్ పదార్థాలను ల్యాబ్ కు పంపారు.



ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా నటిస్తున్నాడు. అందుకే ఈ టైటిల్ పెడితే బాగుంటుందని చిత్రబృందం భావిస్తోందట. ప్రస్తుతానికి ఇదే ఈ సినిమా వర్కింగ్ టైటిల్. దీనికంటే మంచి టైటిల్ ఆలోచన వస్తే.. దాన్నే ఫిక్స్ చేస్తారట. లేదా 'ఫౌజీ' టైటిల్‌నే ఖరారు చేస్తారట. 1947 కంటే ముందు సాగే కథ ఇది. ప్రభాస్ బ్రిటీష్ సైన్యంలో ఓ సోల్జర్‌గా కనిపించనున్నాడు. అయితే ఇప్పటికే వరుసగా మూడు, నాలుగు సినిమాల షూటింగ్స్ తో ప్రభాస్ బిజీబిజీగా గడుపుతున్నారు. మరోవైపు ఫౌజి సినిమా షూటింగ్ కూడా ప్రారంభమవడంతో ఈ సినిమా నుంచి ఓ అప్డేట్ అందింది. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఆ ట్రీట్ రివీల్ చేయబోతున్నారు. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్', 'ఫౌజి', 'సలార్ 2', 'కల్కి 2', 'స్పిరిట్' సినిమాల్లో నటిస్తున్నారు. మొదటగా వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ కానున్న మారుతీ చిత్రం 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీబిజీగా గడుపుతున్నాడు.



# ప్రీ ఇండిపెండెన్స్ స్టోరీగా ఫౌజీ

ఈ క్రమంలోనే మొదలుపెట్టిన హను రాఘవపూడి 'ఫౌజి' సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. అయితే ప్రస్తుతం ప్రభాస్ డేట్స్ లేకపోవడంతో డైరెక్టర్ మొదటి షెడ్యూల్‌లో ఇతర సీన్స్ చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ నెల 23న బర్త్ డే అనంతరం ప్రభాస్ ఫౌజి షూటింగ్‌లోకి ఎంటర్ కానున్నడని సమాచారం. అలాగే 2, 3 వారాలు ఫౌజి సినిమాకే కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోవైపు ప్రభాస్ అభిమానులకు భారీ ట్రీట్ ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 23న కొత్త సినిమాల అప్‌డేట్‌లతోపాటు ఆయన గత చిత్రాలతో ప్రేక్షకుల్ని అలరించడానికి మేకర్స్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ప్రభాస్ నటించిన అరడజనకు పైగా సినిమాలు రీ రిలీజ్ చేయనున్నారు. మిస్టర్ పర్ఫెక్ట్, మిర్చి, ఛత్రపతి, ఈశ్వర్, రెబల్, సలార్ చిత్రాలు రిలీజ్ కానున్నాయి.

# మేజర్ ముకుంద్ వరదరాజన్ బయోపిక్

అమరన్ మూవీలో శికార్తికేయన్, సాయపల్లవి జంట

శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్' రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చెన్నై వేదికగా దీని ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సాయిపల్లవిని శివకార్తికేయన్ ప్రశంసించారు.'మేజర్ ముకుంద్ వరదరాజన్ గురించి మొదట వార్తల్లో విన్నా. రాజ్ కుమార్ ఈ కథను వివరించినప్పుడు భావోద్వేగానికి గురయ్యా. ముకుంద్ గొప్ప లీడర్. కశ్మీర్‌లో 100రోజుల పాటు యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించాం. రాత్రిపూట కావడంతో చలి ఎక్కువగా ఉండేది. ఈ చిత్రం క్లైమాక్స్ అందరినీ కంటతడి పెట్టిస్తుంది. ముకుంద్ అందమైన జీవితాన్ని, ఆయన కుటుంబాన్ని అందరూ గౌరవించేలా దీన్ని



తీర్చిదిద్దాం. ఈ సినిమా కోసం ఆయన కుటుంబాన్ని సంప్రదించినప్పుడు తమిళ హీరోతోనే తీయాలని వాళ్లు కోరారు. ముకుంద్‌కు తమిళ పరిశ్రమ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. నేను ఓ టీవీ ఛానల్‌లో వర్క్ చేస్తున్నప్పుడు సాయిపల్లవిని మొదటిసారి కలిశాను. నేను వ్యాఖ్యతగా వ్యవహరించిన ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్'లో ఆమె నటన చూసి ఆశ్చర్యపోయా. ఫోన్ చేసి ప్రశంసించా. ఆమె వెంటనే 'థ్యాంక్యూ అన్నా' అని చెప్పింది. నన్ను అన్నా అని పిలిచినందుకు అప్పుడు చాలా ఫీలయ్యాను. ఆమె గొప్ప నటి' అని అన్నారు. 'ఈ సినిమా దేశమంతా గర్వపడుతుంది. ఇటీవల కమల్‌హాసన్ ఈ చిత్రం చూసి భావోద్వేగానికి గురయ్యారు. టిష్యూలు దగ్గర పెట్టుకొని దీన్ని చూశారు' అని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. మణిరత్నం మాట్లాడుతూ..'ముకుంద్ లాంటి గొప్ప వ్యక్తుల గురించి అందరూ తెలుసుకోవాలి. నేను సాయి పల్లవికి పెద్ద అభిమానిని. భవిష్యత్తులో ఆమెతో కలిసి వర్క్ చేయాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. శివకార్తికేయన్ ఈ సినిమాకు సరైన ఎంపికని సాయి పల్లవి అన్నారు.

# బాలకృష్ణ అన్‌స్టాపబుల్-4 రెడీ

## తొలుత బన్నీతో అనుకుని షూటింగ్ పార్ట్ పూర్తి

## తాజాగా బాబు, పవన్‌తో ఉంటుందని ప్రచారం




నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఓటీటీ షో 'అన్‌స్టాపబుల్' సీజన్ 4' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. దీపావళి పండగని పురస్కరించుకొని తొలి ఎపిసోడ్ రిలీజ్ చేసేందుకు ప్రయ్నత్నాలు జరుగుతున్నాయి. అయితే అన్ స్టాపబుల్ 4 ఫస్ట్ ఎపిసోడ్‌కు అల్లు అర్జున్ గెస్ట్‌గా రానున్నట్లు వార్తలు వచ్చాయి. పుష్ప 2 మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో పుష్ప టీమ్ గెస్ట్ లుగా రానున్నారు. అయితే ఈ ఎపిసోడ్ షూట్ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. కాగా పుష్ప మూవీ డిసెంబర్‌లో రిలీజ్ కానుండటంతో ఈ ఎపిసోడ్‌ని మూవీ రిలీజ్ టైమ్‌లో విడుదల చేద్దామని ప్లాన్ చేశారట. దీంతో ఫస్ట్ ఎపిసోడ్ కోసం ఇద్దరు ప్రభుత్వాధినేతలను పిలుస్తున్నట్లు సమాచారం. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ షోకి మరోసారి గెస్ట్‌గా రానున్నట్లు సమాచారం. అలాగే ఈ ఎపిసోడ్‌నే తొలి ఎపిసోడ్‌గా దీపావళి కానుకగా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తుందట ఆహా. అయితే చంద్రబాబు నాయుడితో పాటు ఈ ఎపిసోడ్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరు కానున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్న అఫిషియల్‌గా ఎలాంటి సమాచారం లేదు. కాగా సోషల్ మీడియా వేదికగా బన్నీ వర్సెస్ మెగా ఫ్యాన్స్‌గా నడుస్తున్న గొడవలకి ఈ షో ఏమైనా ఫుల్ స్టాప్ పెడుతుందా చూడాలి.



# రజనీ సార్ సూచనను పట్టించుకోలే..

## మనసులో మాట బయటపెట్టిన రాహుల్ సిప్లిగంజ్

'నాటునాటు'తో ఆస్కార్ స్టేజ్‌పై ప్రదర్శన ఇచ్చి.. ఎంతోమంది అభిమానాన్ని చొరగొన్న తెలుగు గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తాజాగా ఆయన ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో పలు విశేషాలు పంచుకున్నారు. ముఖ్యంగా రజనీకాంత్‌తో దిగిన ఓ ఫొటో వైరల్‌గా మారడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తాను చేసిన తప్పు అదేనని.. అందుకు ఎంతో బాధపడుతున్నానని చెప్పారు.




'రంగమార్తాండ' సినిమా షూట్ వల్ల ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణతో నాకు అనుబంధం ఏర్పడింది. ఆ సినిమా షూట్‌లో ఉన్నప్పుడు.. నేను రజనీకాంత్‌కు వీరాభిమానిని అని ప్రకాశ్‌రాజ్‌కు తెలిసింది. దాంతో ఆయన నన్ను పిలిచి.. రేపు తాను రజనీకాంత్ సినిమా షూట్‌కు వెళు_న్నట్లు చెప్పారు. నన్ను కూడా రమ్మన్నారు. అలా, 'అన్నాత్తే' షూట్‌కు వెళ్లా. రజనీ సర్‌కు నన్ను పరిచయం చేశారు. వెంటనే కాళ్లకు నమస్కారం చేశా. అయితే అప్పుడు ఆయన మూవీ కాస్ట్యూమ్స్ (సినిమాలో కనిపించే లుక్)తో ఉన్నారు. నా ఇష్టాన్ని గమనించి ఫొటో దిగారు. సినిమాకు సంబంధించి తన లుక్ ఇంకా రిలీజ్ చేయలేదని.. కాబట్టి, సినిమా రిలీజ్ అయ్యే వరకూ ఆ ఫొటో ఎక్కడా షేర్ చేయొద్దని చెప్పారు. దాదాపు 10 రోజులు గడిచిపోయాయి. ఆనందం తట్టుకోలేక ఒకరోజు దాన్ని సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేశా. అది కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది. హీరో లుక్ బయటకు రావడంతో నిర్మాణ సంస్థ కంగారు పడింది. నాకు తెలిసి జీవితంలో నేను చేసిన పెద్ద తప్పు అదే. ఒక అభిమానిగా ఇప్పటికీ బాధపడుతుంటా. ఆ తర్వాత దానిని డిలీట్ కూడా చేసేశా' అని రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. కథానాయికల్లో దీపికా పదుకొణె అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. 'ఆస్కార్' వేదిక మీద ఆమె తమని పరిచయం చేసినప్పుడు.. తాను ఎంతో ఆనందించానని అన్నారు.

# కాస్ట్ కౌచింగ్ అంతా దుష్ప్రచారమే

తెలుగు పరిశ్రమపై అనన్య నాగళ్ల అచ్చ తెలుగమ్మాయి హీరోయిన్ అనన్య నాగళ్ల త్వరలో పొట్టేల్ అనే రూరల్ పిరియాడిక్ డ్రామా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. దీపావళికి ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర యూనిట్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కాస్టింగ్ కౌచ్ పై షాకింగ్ ప్రశ్నలు వేయగా నటి అనన్య కూడా అదే రేంజ్‌లో జవాబు ఇచ్చి ఔరా అనిపించింది. తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలోకి రావాలంటే భయపడతారు.. అవకాశాలు ఇవ్వాలంటే కమిట్మెంట్ అడుగుతారని టాక్ ఉంది కదా మీకు ఇలాంటి అనుభవం ఎదురైందా అని ఓ మహిళా విలేకరి అనన్య కు ప్రశ్న వేసింది. దానికి ఆమె మీరు తెలుసుకోకుండా వంద శాతం ఉంటుందని ఎలా అడుగుతున్నారని జవాబిచ్చింది. మీరు చేసే అగ్రిమెంట్ట్‌లో కూడా ఉంటుందట కదా, మా ఫ్రెండ్సే చెప్పారు అని మరో క్వశ్చన్ వేయగా ఈ వందశాతం తప్పు అని ఆనన్య సమాధానమిచ్చింది. అవకాశం రావడం కంటే ముందే కమిట్మెంట్ అనేది టాలీవుడ్‌లో లేదని, ఎక్కడైనా పాజిటివ్, నెగెటివ్ అనేది సమానంగా ఉంటాయని మీరు ఎక్స్ పీరియన్స్ చేయకుండా అలా ఎలా అడుగుతున్నారంటూ అనన్య ఆన్సర్ ఇచ్చింది. అంతేగాక నటిగా నేను చెబుతున్నా క్యాస్టింగ్ కౌచ్ పరిస్థితులైతే ఇండస్ట్రీలో లేవని తెలిపారు. నేను ఆ ఫీల్డ్ లోనే ఉన్నా. మీరు అనుకున్నది ఇక్కడ లేదని అనన్య గట్టిగా బదులిచ్చింది. అక్కడ అనన్య సమాధానాలు విన్న చాలామంది అనన్య ధైర్యాన్ని, బయ పడకుంగా చెప్పిన విధానాన్ని చాలామంది మెచ్చుకోవడమే కాక చప్పట్లతో ప్రశంసించారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది.

# విద్యార్థులు నిత్యం కళాశాలకు హాజరు కావాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, దోమకొండ, అక్టోబర్ 19:**





విద్యార్థులు నిత్యం కళాశాలకు హాజరై, విద్యాబుద్ధులు నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం రోజున దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలో చివరి స్థానంలో ఉందని అన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు కళాశాలకు రావాలని, అటెండెన్స్ ప్రతీ రోజూ ఉండాలని, లెక్చరర్స్ చెప్పిన పాఠాల్ని ఏ రోజు కారోజు అర్థం చేసుకోవాలని, ఏదైనా సమస్యలు ఉంటే కళాశాల ప్రిన్సిపాల్ కు తెలియజేయాలని అన్నారు. తమ పిల్లలు రోజు కళాశాలకు వెళ్తున్నారా లేదా తెలుసుకోవాలని, విద్యార్థులు హాజరు వివరాలను పేరెంట్స్ కు తెలపాలని, అందుకు ప్రతీ విద్యార్థి పేరెంట్స్ సెల్ ఫోన్ నంబర్ కళాశాలలో నమోదు చేయాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. ఆర్టీసి బస్సులు కళాశాల వద్ద ఆపడానికి, వివిధ గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం సమయానుకూలంగా బస్సులను నడిపే విధంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ తెలిపారు. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ జి. శంకర్ మాట్లాడుతూ, కళాశాలలో 299 మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రతీ రోజూ 100 నుండి 150 మంది పిల్లలు మాత్రమే హాజరవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సలాం, తహసీల్దార్ సంజయ్ రావు, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి జ్యోతి, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి.

- రైతులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచన.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 19:**



ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని బీబీపూర్, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీసీవో శ్రీనివాస్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, విండో ఛైర్మన్ రామచంద్ర గౌడ్, వైస్ ఛైర్మన్ కుమ్మరి చిన్న గంగారాం, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ మునిపెల్లి సాయి రెడ్డి, ఏవో సుధా మాధురి పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్సీ కోదండరాంకు సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 19:**




తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి రాష్ట్ర సాధనలో ముందుండి జేఏసీని నడిపించిన ఎమ్మెల్సీ కోదండరాంను నగరంలోని టీఎన్జీవో భవన్లో ఆదివారం సన్మానించనున్నట్టు జేఏసీ ఛైర్మన్ గోపాల శర్మ, జేఏసీ కన్వీనర్ గైని గంగారం, అధికార ప్రతినిధి వి. ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఎర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన వారి ఆకాంక్షలు ఇంకా నెరవేరలేదని గుర్తు చేశారు. ఆనాడు ఏ ఒక్క పార్టీ తో తెలంగాణ రాష్ట్రం సాధ్యం కాదని మేధావులు, ఉద్యమ నాయకులు చర్చించి జే ఏ సి ఏర్పాటు చేయటం జరిగిందని, తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామన్నారు. జేఏసీ ఛైర్మన్ కోదండ రాముకు ఎమ్మెల్సీగా నియమించిన సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. మేధావులు విద్యావేత్తలు పార్టీలకు అతీతంగా నాయకులు విచ్చేసి సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, డాక్టర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష సమావేశం.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, అక్టోబర్ 19:**

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి. వైజయంతి ఆదేశాల మేరకు శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మి నర్సయ్య, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో నూతనంగా అమలులోకి వచ్చిన చట్టాల గురించి బాధితులకు, సాక్షులకు సాక్షం ఇచ్చుటలో ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల రక్షణ చట్టాల గురించి డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య క్లుప్తంగా వివరించారు. సమావేశంలో నూతనంగా నియమింపబడిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రాజేశ్వర్ ను డిప్యూటీ డైరెక్టర్, ఉమ్మడి జిల్లాలలోని ప్రాసిక్యూటర్లు సన్మానించారు. ఈ సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజారెడ్డి, బంటు వసంత్, శ్యాంరావు, నిమ్మ దామోధర్ రెడ్డి, ఖాందేష్ శ్రీనివాస్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి. రామకృష్ణ, యం.డి. రహిముద్దిన్, భూసారపు రాజేష్ గౌడ్, రాణి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.






**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, అక్టోబర్ 19:**

పాఠశాల స్థాయి నుండే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ అంబాసిడర్స్ కు అవగాహన, క్విజ్ పోటీని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవడంతో పాటు, తోటీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, కుటుంబీకులకు, ఇరుగుపొరుగు వారికి తెలియపరుస్తూ అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రోడ్ సేఫ్టీ అంబాసిడర్స్ లను నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 61 పాఠశాలల్లో 122 మంది అంబాసిడర్స్ లను నియమించడం జరిగిందన్నారు. ప్రతీ ఒక్కరికీ డ్రైవింగ్ రూల్స్ తెలియడం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను తరచుగా నిర్వహించడం ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించవచ్చు అన్నారు.


**కొత్త చట్టం ప్రకారం 10 సంవత్సరాలు జైలు శిక్ష: ఎస్పీ సింధు శర్మ.**

జిల్లాలో 520 గ్రామాలుండగా గత సంవత్సరం సుమారు 500 లకు పైగా ప్రమాదాలు జరిగాయని జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. ప్రతీ రోజూ ప్రతీ ఒక గ్రామంలో ప్రమాదం జరిగినట్లు అవగతం అవుతున్నదని అన్నారు. జిల్లాలో రెండు జాతీయ రహదారులున్నాయని, ప్రతీ వాహన చొదకుడు అప్రమత్తంగా వాహనాలను నడిపించాలన్నారు. ప్రమాదాలు చేసినవారికి కొత్త చట్టం ప్రకారం 10 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి రాజు, డిఎస్పీ నాగేశ్వర్ రావు, పోలీసు అధికారులు, వివిధ పాఠశాలల ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఛార్జీల నియంత్రణ ఏదీ

**అమరావతి:** విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, విద్యుత్ బిల్లుల భారం తగిస్తాం అని ఉమ్మడి మేనిఫెస్టో (ఆరవ పేజీలో) హామీనిచ్చి అధికారానికి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి. సర్దుబాటు చార్జీలు విద్యుత్ వాడకానికి సంబంధించినవే. అంతకన్నా ముఖ్యంగా రెండున్నరేళ్ల క్రితం వాడిన కరెంటుకు ఇప్పుడు చెల్లించాలనడం దారుణం. కూటమి సర్కారు చార్జీలను నియంత్రించడం కాదు సరికదా మరింత విశృంఖలం గావిస్తున్నది. బిల్లుల భారం తగ్గించడం గాక పెనుభారం మోపుతోంది. ఏలినవారు విజ్ఞతతో యోచించి ప్రతిపాదిత 'సర్దుపోటు'ను ఉపసంహరించడం అందరికీ శ్రేయస్కరం! సర్దుబాటు చార్జీల మూలంగా యూనిట్‌కు రూ.1.27 మాత్రమే భారం పడుతుందని డిస్కాముల వివరణ పత్రం పేర్కొన్నది. రాష్ట్ర వ్యాప్త విద్యుత్ వినియోగం, సర్దుబాటు చార్జీ సగటు లెక్కించి ఆ మొత్తం తేల్చేశారు. కానీ వాస్తవానికి సర్దుబాటు చార్జీలను ఆయా త్రైమాసికాలనుబట్టి, ఆయా డిస్కాములు ఎంత చొప్పున వసూలు చేయవచ్చునో ఇ.ఆర్.సి నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం అది ఒక్కో డిస్కాముకు ఒక్కో త్రైమాసికానికి యూనిట్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. ఈ మాత్రం లాజిక్ కూడా లేకుండా ప్రజలను మభ్యపుచ్చేందుకు ప్రభుత్వ రంగంలోని డిస్కాములు యత్నించడం దారుణం. అంతేగాక ఇది పేదలకు పెనుభారం. ప్రస్తుతం వున్న టారిఫ్ ప్రకారం రోజుకు ఒక్క యూనిట్ మించకుండా (నెలకు 30 యూనిట్లు) వాడే నిరుపేదలు ఒక్కో యూనిట్‌కు ఇంధన చార్జీగా రూ.1.90, అదే నెలకు 400 యూనిట్లకు పైబడి వాడే సంపన్నులు యూనిట్‌కు రూ. 9.75 చొప్పున చెల్లించాలి. డిస్కాముల వివరణలో పేర్కొన్న సర్దుబాటు రూ.1.27 మాత్రమే అనుకున్నా నిరుపేదల ఇంధన చార్జీకి అదనంగా 67 శాతం చెల్లించాలి. అదే సంపన్నులకు మాత్రం అది 13 శాతమే! మొత్తం విద్యుత్ సంస్కరణల మాటున జరిగేవి ఇలాంటి మాయాజాలాలను ప్రజలు గుర్తించాలి. 11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీ కూడా ఈ వరుసలోనే ఉందని వార్తలొచ్చాయి. అంటే మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. ఇప్పటికే అధిక ధరలు, తరుగుతున్న ఆదాయాలతో సతమతమవుతున్న ప్రజానీకం పులి మీద పుట్రలా పడిన విద్యుత్ భారాన్ని ఎలా చెల్లించగలం అని ఆందోళన చెందుతున్నారు. జనం గందరగోళ పడుతుండగా ఈ సర్దుబాటు చార్జీలకు ఇప్పటి ప్రభుత్వానికి సంబంధం లేదని డిస్కాములు అక్టోబర్ 1న సుదీర్ఘ వివరణ ఇచ్చాయి. ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేరుతో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు చార్జీ వసూలు చేయడమేమిటి? వాటిని రద్దు చేయండి' అని ప్రజలు చాలా ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా పాలకులు వెనక్కు తగ్గడంలేదు. రాష్ట్రంలో ఎవరు అధికారంలోవున్నా ఈ విషయంలో మాత్రం మార్పు లేదు. సర్దుబాటు చార్జీలను నిర్ణయించి, ఆ మొత్తాన్ని వినియోగదార్ల నుండి ఎప్పుడు ఎన్ని వాయిదాల్లో వసూలు చేయాలో ఇఆర్‌సి ఉత్తర్వులిస్తుంది. కాబట్టి ఈ మొత్తం పక్రియ ఒక త్రైమాసికం పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా పూర్తి కావాలి. అధికారం ఏ పార్టీ చేతిలోవున్నా విద్యుత్ భారాలు, ఆ విధానాలూ అలాగే కొనసాగుతున్నాయి!ఒప్పందాలు కుదుర్చుకున్న ప్లాంట్ల నుండి రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా కావడం లేదంటూ ఓపెన్ మార్కెట్‌లో అధిక ధరకు పవర్ ఎక్స్‌ఛేంజి నుండి డిస్కాములు భారీగా కొనుగోలు చేశాయి. ఇవన్నీ ఆనాటి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారమే జరిగాయన్న విషయం మరువరాదు.

# గ్రూప్-1 అభ్యర్థుల నిరసన ఉద్రిక్తం



గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని, జీవో నం.29ను రద్దు చేయాలంటూ అభ్యర్థులు చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తంగా మారింది. శనివారం హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లోని కోచింగ్ కేంద్రాల నుంచి వందల మంది అభ్యర్థులు ఒకేసారి బయటకు వచ్చారు. సెక్రటేరియట్‌కు ర్యాలీగా బయలుదేరారు. వీరికి మద్దతుగా ఏబీవీపీ, భాజపా కార్యకర్తలు, కేంద్ర మంత్రి బండి సంజయ్ అక్కడికి చేరుకున్నారు. అశోక్‌నగర్‌లో రోడ్డుపై బైఠాయించారు. అనంతరం సచివాలయానికి వెళ్లాల్సిందేనని సంజయ్ పిలుపునివ్వడంతో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇటు పోలీసులు, అటు అభ్యర్థులు, కార్యకర్తలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను దారిమళ్లించారు. పలు కూడళ్లను మూసివేశారు. పోలీసులతో వాడీవేడి వాదోపవాదాల అనంతరం అభ్యర్థులు, ఏబీవీపీ, భాజపా కార్యకర్తలు సంజయ్‌తో కలిసి పాదయాత్రగా సచివాలయ ముట్టడికి బయలుదేరారు. వారిని పోలీసులు అదుపులో తీసుకుని బలవంతంగా వ్యాన్‌లలో ఎక్కించారు.సంజయ్‌ను అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. ఇందిరాపార్కు చౌరస్తా, రామకృష్ణ మఠం నుంచి సంజయ్, అభ్యర్థులు, కార్యకర్తలు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, భాజపా నేతలు కాసం వెంకటేశ్వర్లు, రాణిరుద్రమదేవి, బండారు విజయలక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ తదితరులు సచివాలయం వైపు దూసుకెళ్లారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయనకు నివాళులు అర్పించిన కేంద్ర మంత్రి.. అక్కడ రోడ్డుపై బైఠాయించారు. ఆయనకు మద్దతుగా గ్రూప్-1 అభ్యర్థులు, ఏబీవీపీ కార్యకర్తలు సచివాలయం ఎదుట కూర్చోవడంతో ట్రాఫిక్ మొత్తం స్తంభించింది. అభ్యర్థులు, భాజపా నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని భాజపా రాష్ట్ర కార్యాలయానికి తరలించారు. అదే సమయంలో వందల మంది సచివాలయం వద్దకు దూసుకెళ్లగా.. వారిని అదుపులోకి తీసుకుని నగరంలోని వేర్వేరు ఠాణాలకు తరలించారు. పరుగులు పెడుతున్నవారినీ పట్టుకొని.. వ్యాన్‌లలో ఎక్కించారు. ఈ సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది.

# వచ్చే నెలలో అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు:శ్రీవారి పట్టపురాణి శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వేళయింది. ఏటా కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతాయి. నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 వరకు జరిగే శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు తిరుచానూరు ముస్తాబు అవుతోంది. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టిన టిటిడి పనుల్లో నిమగ్నమైంది. ఈ మేరకు బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లను టిటిడి జెఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు, నవజీవన్ కంటి ఆసుపత్రి సమీపంలోని ఖాళీ స్థలం, ఘంటసాల సర్కిల్, హైస్కూల్ పరిసరాలు, పసుపు మండపం, పూడి రోడ్డు తదితర ప్రాంతాలను జేఈఓ వీరబ్రహ్మం పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలు వీక్షించేలా టిటిడి లోని అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో చివరి రోజైన పంచమి తీర్థం లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా భక్తులు సేదతీరేందుకు నవజీవన్ కంటి ఆసుపత్రి, హైస్కూలు, పూడి రోడ్డులోని గోశాల వద్ద జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పుష్కరిణిలోకి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు తగిన విధంగా గేట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు అర్థం అయ్యేలా తమిళ భాషలోనూ సైన్ బోర్డులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు జేఈఓ వీరబ్రహ్మం. ఇక అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భద్రతా పరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు టిటిడి సివిఎస్వో శ్రీధర్ తెలిపారు.పంచమి తీర్థం రోజున భక్తులు సేద తీరేందుకు ఏర్పాటు చేసే షెడ్లలో, క్యూలైన్లు, పుష్కరిణి వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు.